క్లుప్తంగా

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న కోదండయ్య

నగరి: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలరి వారికి అందించే ఆటోడ్రైవర్ సేవా పథకం ఎంటువంటి ఆంక్షలు లేకుండా అందరికీ వర్తింపజేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు రవి, ఏసు, లాజర్ ఆటోస్టాండ్ వద్ద మంగళవారం ఆయుధ పూజ వేడుకలు నిర్వహించారు. కోదండయ్య మాట్లాడుతూ ఆటో కార్మికుల రవాణా రంగాన్ని ఇబ్బంది పరిచే జీఓ నంబర్ 21, 31లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆటోవర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి


అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని మండల విద్యాశాఖాధికారులు రాజేంద్ర ప్రసాద్, గిరిజ తెలిపారు. మంగళవారం ఆముదాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థు ల సంఖ్య పెంచాలని కోరారు. మధ్యాహ్న భోజ నం నాణ్యతగా చేయించాల్సిన బాధ్యత సంబంధిత హెచ్ఎంపై ఉందన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూ చించారు. కార్యక్రమంలో సీఆర్సీ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న కల్పలతారెడ్డి

పాలసముద్రం : రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు సత్వర రుణాలను అందిస్తూ లాభాల బాటలో నడుస్తున్న ఏకైక సహకార సంస్థ స్త్రీనిధి అని ఐకేపీ ఏపీఎం కల్పలతారెడ్డి తెలిపారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. బ్యాంకు లింకేజీల ద్వారా అందిస్తున్న రుణాలను సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్ర, శోభ, మంజుల, మురగయ్య, బాలయ్య, మంజుల పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి యత్నం న్యాయవ్యవస్థపై దాడే!

నగరి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని యావత్తు న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగానే పరిగణించాలని వైఎస్సార్‌సీపీ నగరి నియోజకవర్గ న్యాయవిభాగ కార్యదర్శి ఏజీ బాబు అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన పార్టీలు దాడిని ఖండించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇంతకుముందు ఎప్పుడూ ఇలాంటి దాడి జరగలేదని తెలిపారు. సనాతన ధర్మం పేరుతో దాడి జరగడం బాధాకరమన్నారు. దాడి చేసిన దుండగునిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, దేశద్రోహం చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన శిక్ష విధించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

నింద్ర: మన పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవడం అందరి బాధ్యత అని ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ అన్నారు. ప్రతి పంచాయతీలో పరిసరాల పరిశుభ్రత పురస్కరించుకుని మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మట్లాడుతూ గ్రామాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి కృషి


ట్రాక్టర్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్

కార్వేటినగరం : పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. అనంతరం వేణుగోపాలస్వామి ఆర్చీ వద్ద నుంచి గాండ్ల మిట్ట కూడలి వరకు ట్రాక్టర్‌పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు పాల్గొన్నారు.

రైతులకు కియోస్క్ సేవలు దూరం


సూరికాపురంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ మిషన్

- రైతుసేవా కేంద్రంలో మూలనపడిన కియోస్క్
- నిలిచిన ఎరువులు, పురుగు మందుల విక్రయాలు
- సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల వద్దకు రైతుల పరుగులు

నగరి: కియోస్క్ ద్వారా రైతులకు ఎరువు, పురుగు మందులు అందించాలన్న లక్ష్యంతో ప్రతి సచివాలయ కేంద్రాల్లో గత ప్రభుత్వం కియోస్క్ సేవలను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్బీకే సేవలను పట్టించుకోకపోవడంతో రైతులు ఎరువులు, పురుగు మందుల కోసం ప్రైవేటు డీలర్లపై ఆధారపడుతున్నారు. టీడీపీ అధికారం చేపట్టిన ప్రతిసారి రైతులను పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు.

నిరుపయోగంగా కియోస్క్ మిషన్లు

నగరి నియోజకవర్గంలోని 5 మండలాల్లో 78 సచివాలయాలతోపాటు రైతు భరోసా కేంద్రాల్లో గత ప్రభుత్వం అన్ని రకాల సేవలను పారదర్శకంగా అందించేందుకు కియోస్క్‌లను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా నమోదు చేసుకున్న రైతులకు ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్, యంత్ర పరికరాలు, ఇంటి ముంగిటకే పంపిణీ చేసింది. దీంతో రైతులకు మండల కేంద్రాలకు పరుగులు తీసే బాధ తప్పింది. ఇలా రైతులకు ఎన్నో విధాలుగా అండగా నిలిచిన రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసే దిశగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు వ్యవసాయం దండగా అంటూ రైతులను నిరాశపరిచిన చంద్రబాబు నేడు ఆర్బీకే సేవలకు మంగళం పాడే పనిలో పడ్డారు. అంతే కాకుండా కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చడం తప్ప మిగిలిన సేవలకు మంగళం పాడుతూ వస్తోంది. దీంతో రైతులకు సేవలందించే కియోస్క్ మూలన పడింది.

కియోస్క్ ప్రత్యేకతలు

గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల్లో డిజిటల్ కియోస్క్ ఏర్పాటు చేశారు. రైతులకు పారదర్శకంగా సేవలందించే లక్ష్యంతో ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే ఈ మిషిన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటి ద్వారా రైతులే నేరుగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు, రైతులు పండించిన పంటలకు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గరలో ఉన్న మార్కెటింగ్ వివరాలు సేవలను పొందే అవకాశం కల్పించారు. వాతావరణ సమాచారం, ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని అందులో పొందుపరిచి రైతులకు అందించేవారు.

కియోస్క్ సేవలు పునరుద్ధరించాలి

గతంలో రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు ఇబ్బంది లేకుండా కియోస్క్ ఆధారంగా అధికారులు ఇంటింట సరఫరా చేసేవారు. కూటమి ప్రభుత్వం వాటిని ఉపయోగించడం లేదు. దీంతో అన్ని సచివాలయాల్లో కియోస్క్ యంత్రాలు మూలన పడి ఉన్నాయి. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ముమ్మరంగా సాగుతున్నా కియోస్క్ ఉపయోగంలో లేకపోవడంతో రైతులు ఆ సౌకర్యాలను పొందలేకపోతున్నారు. యాజమాన్య పద్ధతులు, మార్కెట్ ధరలు వంటి సమాచారం తెలుసుకునే వీలు లేకుండాపోయింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతుసేవా కేంద్రాల్లోని కియోస్క్ ఆధారంగా రైతులకు ఎరువులు, పురుగులమందులు అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మొబైల్‌లో చేస్తున్నాం

అన్ని కేంద్రాలు పనిచేస్తున్నాయి. కియోస్క్‌లో చేయాల్సినవన్నీ మొబైల్ ద్వారా చేస్తున్నాం. రైతులకు కూడా మొబైల్ ద్వారా అవసరమైన వాటిని బుక్ చేస్తున్నారు.

రజనికుమారి, ఏఓ విజయపురం

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

నింద్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పక వేయించాలని పశువైద్యాధికారి సంధ్య సౌందర్య అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామల్లో పశు వైద్యసేవలను పరిశీలించారు. ఆమె మట్లాడుతూ గాలికుంటు నివారణ టీకాలు వేయించని రైతులు సద్వినియెగం చేసుకోవాలని కోరారు. పాడి ఆవులకు పాలు దిగుబడి తగ్గడం, జర్వం, చొంగకారడం , కుంటడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశు వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

ఉన్నత స్థాయికి ఇంటర్ తొలి మెట్టు

పాలసముద్రం : విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి ఇంటర్ ఉతీర్ణతే తొలి మెట్టని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హేమలత తెలిపారు. మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్యార్థులను తల్లిదండ్రులు ఇంటి వద్ద చదివించాలన్నారు. విద్యార్థులు విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెడితే ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. అనంతరం జీఎస్టీ 2.0పై బ్యానర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొగిలిలో దొంగలు పడ్డారు!

బంగారుపాళెం: మండంలోని మొగిలి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. ఓ దుకాణ యజమాని ఇంటి ముందు ఆపి ఉంచిన బుల్లెట్‌ను అపహరించారు. జాతీయ రహదారిని పక్కనే ఉన్న మొగిలిలో మంగళవారం తెల్లవారుజామున ఐదుగురు గుర్తు తెలియని దొంగలు ముసుగులు ధరించి, చేతుల్లో కట్టెలు, బ్యాటరీ ఇళ్లల్లో చోరీ చేసేందుకు వచ్చారు. ఉదయం 2 గంటల సమయంలో మొగిలీశ్వరాలయ అర్చకులు ఉంటున్న వీధిలో దొంగలు వెళ్లడంతో అదే సమయంలో అర్చకుడు దండపాణి గురుకుల్ పూజా కార్యక్రమానికి హాజరయ్యేందుకు సిద్ధమవుతుండడంతో ఇంటి ముందు ఎవరో సంచరిస్తున్న విషయాన్ని గ్రహించారు. వెంటనే దండపాణి గురుకుల్ మొగిలి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే మొగిలి గ్రామానికి వెళ్లారు. అప్పటికే దొంగలు మొగిలి గ్రామానికి చెందిన ఆనంద్ అనే ఇంటి ముందు పార్కు చేసిన బుల్లెట్ అపహరించుకుపోయారు. ఓ ఇంటి ముందు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో 2.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు రికార్డు అయ్యింది. దొంగ ఓ ఇంటి కిటికీలో తార్చిలైట్ వేసి చూస్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


సీసీ కెమెరాలో రికార్డు అయిన దొంగల సంచారం


ఓ ఇంటి కిటికీలోకి లైట్ వేసి చూస్తున్న దొంగ

వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులకు అండగా ఉంటా!


నిరంజన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి రోజా


రాజారెడ్డిని పరామర్శిస్తున్న రోజా

- మాజీ మంత్రి ఆర్కే రోజా

వడమాలపేట (పుత్తూరు): వైఎస్సార్‌సీపీ కుటుంబసభ్యులకు అన్ని వేళలా అండగా ఉంటానని మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. వడమాలపేట వైఎస్సార్‌సీపీ యువ నేత, వైస్ సర్పంచ్ నిరంజన్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న రోజా మంగళవారం ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అలాగే వడమాలపేటకే చెందిన నగరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ రాజారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని, ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలకు తగిన సూచనలు చేశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

కోతి తెచ్చిన ఉపద్రవం!

- కంప్యూటర్లు, ఫ్రిడ్జ్‌లు, ఫ్యాన్లు ఔట్
- లక్షల్లో ఆస్తి నష్టం


హైఓల్టేజీ దెబ్బకు పనిచేయని కంప్యూటర్లు

వడమాలపేట (పుత్తూరు): ఓ వానరం దెబ్బకు లక్షల్లో ఆస్తి నష్టం సంభవించింది. కంప్యూటర్లు, ఫ్రిడ్జ్‌లు, ఫ్యాన్లు, విద్యుత్ మీటర్లు..ఇలా ఒక్కటేమిటి పలు విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. బాధితులు లబోదిబోమనడం మినహా ఏం చేయలేని పరిస్థితి. ఇంతకూ ఆ మర్కటం ఏం చేసిందబ్బా అనేగా మీ డౌటు..!? ఇంకెందుకాలస్యం..ఆ వానర మహాశయుడు ఏం చేశాడో చిత్తగించండి.. వడమాలపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్యాలయం వద్ద మంగళవారం ఓ వానరం అటూ ఇటూ గెంతులేస్తూ, దూకుతూ తన చేష్టలు ప్రదర్శించింది. ఆ తర్వాత ఉన్నఫళాన ఎల్‌టీ విద్యుత్ తీగలపైకి జంప్ చేసింది. ఇది కాస్తా హెచ్‌టీ లైన్‌కు కూడా తగిలింది. దీని దెబ్బకు సబ్‌స్టేషన్‌లో లైన్ ట్రిప్ అయ్యింది. లైన్ ఎందుకు ట్రిప్ అయ్యిందో తెలుసుకోకుండా సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో ఒక్కసారిగా హైఓల్టేజీతో విద్యుత్ సరఫరా అయ్యింది. అంతే..! మండల పరిషత్ కార్యాలయంలోనే కాకుండా తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్లు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు కాలిపోయాయి. పలు నివాస ప్రాంతాల్లో విద్యుత్ మీటర్లు, ఫ్రిడ్జిలు, ఇతర విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. మొత్తంగా లక్షల్లో ఆస్తినష్టం సంభవించింది. దీనిపై పలువురు గగ్గోలు పెడుతూ ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, తాత్కాలికంగా విద్యుత్‌ను పునరుద్ధరించారు. పూర్తి వివరాలను బుధవారం తెలియజేస్తామని ట్రాన్స్‌కో ఈఈ ఆశీర్వాదం తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు పొడిగింపు

విజయపురం: ఈ–క్రాప్ నమోదు గడువును ప్రభుత్వం పొడిగించిందని వ్యవసాయ అధికారి రజినీకుమారి మంగళశారం తెలిపారు. రబీ సీజన్ సాగు చేస్తున్న మండల రైతులకు ప్రభుత్వం మరొకసారి పంట నమోదు కోసం అవకాశం కల్పించిందని అన్నారు. పంట నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం ఈ–క్రాప్ నమోదు గడువు పెంచిందని తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు పొడిగించారన్నారు. వర్షం కారణంగా, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఇతర సర్వేల భారం ఉండడం వలన నమోదు ప్రక్రియ మందగించిందని అన్నారు. దీంతో చాలామంది రైతులు తమ పంటలను నమోదు చేసుకోలేకపోయారన్నారు. రైతులు తమ పంటల వివరాలను రైతు సేవ కేంద్రాల్లో నమోదు చేసుకుని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, పంటల బీమా, పంటను ప్రభుత్వం కొనాలన్నా ఈ–క్రాప్ నమోదు కచ్చితంగా చేయించాలని పేర్కొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కాణిపాకం ఆలయ ఈఓ పెంచలకిషోర్ సిబ్బందిని ఆదేశించారు. కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పారిశుధ్యం పరిశీలించారు. బస్టాండ్‌లోని మరుగుదొడ్లు, స్నానపు ఘట్టాలు ఇతర ప్రాంతాలను సందర్శించారు. అయ్యప్ప భక్తులకు కావాల్సిన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు.

పిరమిడ్ పార్టీకి నోటీసులు

తిరుపతి అర్బన్: 'పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా'కు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షోకాజ్ నోటీసులు జారీ చేసిందని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా వారు వార్షిక ఆడిట్ నివేదికలో ఎన్నికల ఖర్చుల వివరాలను సకాలంలో పంపలేదని చీఫ్ ఎలక్షన్ అధికారి ఆంధ్రప్రదేశ్ వెలగపూడి వారు షోకాజ్ నోటీసులు ఇచ్చారని చెప్పారు. తిరుపతిలోని కోలా వీధిలోని పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యాలయానికి నోటీసులు వచ్చాయని తెలిపారు. ఆ మేరకు పార్టీ అధ్యక్షులు లేదా కార్యదర్శి ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు ప్రధాన ఎన్నికల అధికారి రాష్ట్ర సచివాలయం, 5వ బ్లాకు, వెలగపూడి ఎదుట హాజరుకావాలని సూచించారు.

గరుడుడిపై వరదుడు



కాణిపాకం: పున్నమి పురస్కరించుకుని కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత వరదరాజుల స్వామివారు మంగళవారం గరుడ వాహనంపై విహరించారు. తొలుత మూలవిరాట్‌కు అభిషేక పూజలు చేశారు. రాత్రి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఊరేగుతున్న స్వామికి భక్తులు కర్పూర హారతులు సమర్పించి, మొక్కులు చెల్లించారు.

ఎస్పీతో ట్రైనీ ఐఏఎస్ భేటీ


ఎస్పీకి మొక్క ఇస్తున్న ట్రైనీ కలెక్టర్

చిత్తూరు అర్బన్: ఎస్పీ తుషార్ డూడీని ఇక్కడ శిక్షణ పొందుతున్న ఐఏఎస్ అధికారి నరేంద్ర పాడేల్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. పోలీస్ స్టేషన్ల నిర్వహణ, పనితీరు, చట్టాలపై కూడా నరేంద్ర పాడేల్ తెలుసుకోనున్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ద్వితీయ బహుమతి స్వీకరిస్తున్న చిత్తూరు జిల్లా జట్టు క్రీడాకారులు

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొన్న బాలికల జట్టు ప్రతిభ చాటి రజిత మెడల్ సాధించింది. అనకాపల్లి జిల్లా వెలుగొండ మండలం కృష్ణదేవిపేట హైస్కూల్‌లో ఈ నెల 4 నుంచి 6 వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చిత్తూరు జిల్లా తరపున పాల్గొన్న అండర్–14 బాలికల జట్టు క్రీడాకారులు విజయనగరం జిల్లా జట్టుపై హోరాహోరీగా తలబడ్డారు. ఈ పోటీల్లో స్వల్ప స్కోరు తేడాతో చిత్తూరు జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ద్వితీయస్థానంలో నిలిచిన జిల్లా జట్టు క్రీడాకారులు అతిథులు చేతులు మీదుగా సిల్వర్ మెడల్‌ను స్వీకరించారు. ఈ పోటీల్లో చిత్తూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు చందు, పీడీ దేవా పాల్గొన్నారు.

స్టూడియోలు భారం

- సెల్‌ఫోన్ల ప్రభావంతో తగ్గిపోతున్న స్టూడియోలు
- ప్రభుత్వం ఆదుకోవాలని యజమానుల వేడుకోలు


స్టూడియోలో ఫొటో తీస్తున్న ఫొటోగ్రాఫర్


ఫొటోలను కంప్యూటర్‌లో డిజిటల్ చేస్తున్న డిజైనర్

పాలసముద్రం : ఒకసారి నవ్వండి సర్.. మీ ఫొటో అందంగా వస్తుందని చెప్పి క్లిక్‌మనిపించే తీపి జ్ఞాపకాలను కెమెరాలో బంధించే ఫొటోగ్రాఫర్ల పరిస్థితి దయనీయంగా మారింది. సెల్‌ఫోన్ల ప్రభావం సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో ఫొటో స్టూడియోలు జీవనోపాధి మార్పులు చోటు చేసుకుంటున్నాయి. డిజిటల్ సాంకేతికతతో కంప్యూటర్‌లో లోడు చేసుకున్న ఫొటోలను అవసరాలకు వాడుతున్నారు. దీంతో స్టూడియోదారుల జీవనోపాధి కష్టంగా మారి దుకాణాలు అద్దెలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది.

ఫంక్షన్లకు కూడా సెల్‌ఫోన్ల ద్వారానే జ్ఞాపకాలను భద్రపరుచుకుంటున్నారు. బ్యాంకుల్లో వెబ్ కెమెరాలు అమల్లోకి రావడంతో ఫాస్‌పోర్టుసైజ్ ఫొటోల గిరాకీ తగ్గిపోయిందని ఫొటో స్టూడియో యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం శుభకార్యాలు సమయంలో ఫొటో గ్రాఫర్లకు పనులు ఉంటున్నాయని, మిగిలిన సమయాల్లో పనులు నామమాత్రమేనని చెబుతున్నారు. నెలవారి అద్దెలు, విద్యుత్ బిల్లులు, దుకాణాల్లో పనిచేసే వారికి వేతనాలు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అంతే కాకుండా లక్షల్లో పెట్టి కెమెరాలు కొనలేని పరిస్థితి ఎదురవుతోంది. సాంకేతిక పరిజ్ఞానం పెరగటం వల్ల సెల్‌ఫోన్‌లో తీసిన ఫొటోలను నేరుగా కలర్ ల్యాబ్‌కు వెళ్లి ప్రింటింగ్ వేయించుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఫొటోగ్రఫీ వృత్తిపై ఆధారపడి జీవించే వారికి ప్రభుత్వం చేయూత ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను ఫొటోగ్రఫీ వృత్తి నమ్ముకుని 20 ఏళ్ల నుంచి చేస్తున్నా. అప్పటికీ ఇప్పటికీ ఫొటోగ్రఫీలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ఫొటోగ్రాఫర్ల అభ్యున్నతికి నిధులు కేటాయించి ప్రభుత్వం ఆదుకోవాలి. బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేసి , భవిష్యత్తు తరాలకు ఫొటోగ్రఫీ వ్యవస్థ మనుగడ కోల్పోకుండా చూడాలి. – నియాజ్, మఠవలం

జీవనోపాధి తగ్గిపోతోంది



సెల్‌ఫోన్ ప్రభావంతో ఫొటోగ్రాఫర్‌కు జీవనోపాధి తగ్గింది. దానికి ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల్లో వెబ్ కెమెరాల ఏర్పాటు వల్ల ఫొటోగ్రాఫర్ వ్యవస్థ రానున్న రోజుల్లో దెబ్బతినే పరిస్థితి ఉంది. ప్రభుత్వం వృత్తులపై నమ్ముకునే జీవించే వారికి ఆర్థిక చేయూత అందజేయాలి.

– శాంతి, కార్వేటినగరం, ఫొటోగ్రాఫర్

ఇబ్బందులు పడుతున్నాం



ప్రస్తుతం ఫొటోగ్రఫీ వ్యవస్థలో పోటీతత్వం పెరిగింది. సాంకేతిక పరిజ్ఞానం దాటికి వృత్తిని నమ్ముకునే వారందరు రెండో వృత్తిని చేయలేక, లక్షల్లో వెచ్చించి కెమెరాలు కొనలేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

– చంద్రకుమార్, తిరుమళరాజుపురం, ఫొటోగ్రాఫర్